క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సను కలిసిన జిల్లా విద్యార్థి విభాగ నేతలు



ఎమ్మెల్సీ బొత్సకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న విద్యార్థి విభాగం నేతలు

అమలాపురం టౌన్: స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణను జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు విశాఖపట్టణంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ నారాయణస్వామి, రాష్ట్ర కార్యదర్శి జిల్లెళ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురెడ్డి వివేక్ తదితరులు ఎమ్మెల్సీ బొత్సను కలిసి చిత్రపటాన్ని బహూకరించారు.

పీఈటీ విష్ణుప్రసాద్‌కు సత్కారం



పీఈటీ విష్ణుప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పీఈటీ పరమట విష్ణుప్రసాద్‌ను ఉపాధ్యాయులు, పీఈటీలు శనివారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజరాజేశ్వరి, పీడీ రవిచంద్ర మౌళి, వ్యాయామ ఉపాధ్యాయ అసోసియేషన్ అధ్యక్షుడు వైఎస్ రమణారావు, కామన గణేషరావు, ఈశ్వరరావు, మధుసూదన్‌రావు, బీవీ ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కవల కోటిలింగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బోటనీ (వృక్ష శాస్త్రం), సివిక్స్(పౌర శాస్త్రం) సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గెస్ట్ లెక్చరర్‌కు ప్రభుత్వం నెలకు గౌరవ వేతనంగా రూ.10 వేలు ఇస్తుందని ఆయన తెలిపారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



డ్రైనేజీ నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న డీఈఈ రాజ్‌కుమార్

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక దంగేటివారిపాలెంలో డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను పంచాయతీరాజ్ డీఈఈ రాజ్‌కుమార్ ఆదేశించారు. డ్రైనేజీ నిర్మాణం కోసం బండారులంక దంగేటివారిపాలెంలో స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి సర్పంచ్ పెనుమాల సునీతతో చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, పిచ్చిక శ్యామ్, బొక్కా పార్థసారథి, దొమ్మేటి రాధాకృష్ణ, సర్వేయర్ దీప్తి పాల్గొన్నారు.

23న గ్రామసభలు నిర్వహించాలి

అల్లవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన విధిగా గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ కార్యదర్శులను శనివారం ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులు గుర్తించి ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి గ్రామసభలో తీర్మానం చేయాలన్నారు. అనంతరం మండల పరిషత్ ఆమోదం కోసం పంపించాలని సూచించారు.

రక్తదాన శిబిరం



ఏరియా ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న వీసీకే పార్టీ నాయకులు

అమలాపురం రూరల్: విముక్త చిరుతల కట్చి (వీసీకే) పార్టీ జాతీయ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు తిరుమవళవన్ 62వ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వీసీకే రాష్ట్ర యూత్ అధ్యక్షుడు యడ్ల సత్య, జిల్లా కార్యదర్శి మెండి డేవిడ్ అంబేడ్కర్, గోసంగి వెంకటేష్, పెదపాటి ఏడుకొండలు, నక్కా శ్రీనివాసరావు, పరమట బీమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బండి ఇక రాదండి!

- ఎండీయూ వాహనాల రద్దుపై ప్రభుత్వ యోచన
- రేషన్ కావాలంటే పడిగాపులు కాయాల్సిందే
- రాయితీపై పంచదార, కందిపప్పు కట్



సామంతకుర్రులో రేషన్ బండి వద్ద బియ్యం తీసుకుంటున్న వినియోగదారులు(ఫైల్)

ఉప్పలగుప్తం: పూర్వం తెల్లరేషన్ కార్డు కలిగిన పేద, మధ్యతరగతి ప్రజలు రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే రోజుల తరబడి పనులు మానుకుని రేషన్ డిపోల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. రేషన్ ఇస్తున్నారని ఢంకా మోగించింది మొదలు రేషన్ షాపుల వద్దకు పరుగులు తీసి కార్డులను వరుస క్రమంలో పెట్టుకోవాల్సిందే. వృద్ధులు, ఒంటరి మహిళలైతే చుట్టుపక్కల వారిని బతిమిలాడుకునో, ఎవరికైనా నగదు అందించో రేషన్ బియ్యం ఇంటికి తెచ్చుకోవటానికి నానా ఇబ్బందులు పడేవారు. అది గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఇంటికే రేషన్ బియ్యం అందించేలా ఎండీయూ(మొబైల్ డిస్పెన్సర్ యూనిట్) వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి పేదల కష్టానికి స్వస్తి పలికింది.

వాహనాల రద్దుపై మంత్రివర్గం చర్చ

ఎండీయూ వాహనాలు సామాన్యుడి ఇంటికి రేషన్ సరుకులు అందించటంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు సిబ్బందికి అవస్థలు లేకుండా మధ్యాహ్న భోజనం నిమిత్తం రేషన్ డిపో నుంచి బియ్యాన్ని అందించేవి. అంతా సజావుగా సాగుతున్న సమయంలో పాత ప్రభుత్వం చేసిన మంచి ఉండకూడదనుకున్నారో లేక పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువ అవస్థలు పడితే రేషన్ ఇచ్చిన విషయం గుర్తుంటుంది అనుకున్నారో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసే ఆలోచనను తెర మీదకు తీసుకొచ్చింది. ఈ వాహనాలను రద్దు చేయాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం, కలెక్టర్ల సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుతం ఎండీయూ వాహనాలు ఇంటికి వచ్చి సైరన్ వేయగానే వినియోగదారులు ముఖ్యంగా కుటుంబ యజమాని ఉపాధికి వెళ్లినా ఇంట్లో ఏ ఒక్కరో రేషన్ తీసుకుంటున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ విధానం రద్దు చేయాలని నిర్ణయించుకోవడంతో దూరంలో ఉన్న రేషన్ షాపుకు వెళ్లి, గంటల తరబడి వేచి ఉండి రేషన్ తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడనుంది. దాంతో వినియోగదారులు మళ్లీ మనకు వ్యయప్రయాసలు తప్పవని వాపోతున్నారు. ఇచ్చే బియ్యం కూడా ఇకపై రేషన్ షాపుకు వెళ్లి తెచ్చుకోవలసిన పరిస్థితిపై పలువురు వినియోగదారులు ప్రభుత్వ నిర్వాకంపై పెదవి విరుస్తున్నారు. అధికారం కట్టబెట్టండి, ఉద్ధరిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వ పాలకుల నిర్ణయాలపై విమర్శలు గుప్పిస్తున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో	
రేషన్ కార్డులు	78,845
రేషన్ షాపులు	144
ఎండీయూ వాహనాలు	45

కోత మొదలైంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెల్లకార్డుదారులకు రాయితీతో ఇవ్వాల్సిన పంచదార, కందిపప్పును పూర్తిగా కోత పెట్టింది. గత ప్రభుత్వంలో కేజీ పంచదార రూ.17కు, కేజీ కందిపప్పు రూ.67కు అందించేవారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో, ప్రభుత్వం ఎంపిక చేసిన వర్తక దుకాణాల్లో రాయితీపై ప్రభుత్వం కందిపప్పు అందిస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆ ధర రూ.150 ఉండటం విశేషం. కేవలం బియ్యం ఇస్తూ పేదవాడిని గంజి కాచుకుని తాగమంటోంది ప్రభుత్వం. ఆ బియ్యం సరఫరా కూడా దూరం చేసి ఇంటింటికీ రేషన్ సరఫరాకు చరమగీతం పాడనున్నారన్న ప్రచారంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తప్పవు



మాది విలసవిల్లి పంచాయతీ శివారులో ఉన్న గోకనవిల్లి. గత టీడీపీ ప్రభుత్వంలో రేషన్ తెచ్చుకోవాలంటే పనులు మానుకునో లేదా కిరాయికి ఆటోలను ఏర్పాటుచేసుకుని 5 కిలోమీటర్లు విలసవిల్లి వెళ్లాల్సి వచ్చేది. తీరా వెళ్లిన తర్వాత మా వంతు వచ్చే వరకూ రేషన్ డిపో వద్ద వేచి ఉండాలి. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ బియ్యం అందించే వాహనాలు వచ్చిన తరువాత ఆ ఇబ్బంది తప్పింది. కూటమి ప్రభుత్వం వాహనాలను రద్దు చేస్తే మళ్లీ మాకు ఇబ్బందులు తప్పవు.

– ముషిణి ధనలక్ష్మి, గృహిణి, గోకనవిల్లి, ఉప్పలగుప్తం మండలం

రేషన్ బండి ఆపేస్తే తిప్పలే



పూర్వం రేషన్ షాపులు దగ్గర పడిగాపులు కాసే వాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రవేశపెట్టిన రేషన్ బండి వచ్చిన దగ్గర నుంచి ఇంటి వద్దనే తీసుకుంటున్నాం. రేషన్ బండి ఆపేస్తే మాలాంటి వృద్ధులకు మళ్లీ తిప్పలు తప్పవు. గతంలో కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. ఇప్పుడు రావట్లేదు. దుకాణంలో ఎక్కువ రేటు తీసుకుంటున్నారు.

– కుంచే సాయమ్మ, వృద్ధురాలు, గోపవరం, ఉప్పలగుప్తం మండలం

పట్టు నిలుపుకున్న వైఎస్సార్ సీపీ

- మున్సిపల్ ప్యానల్ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన రెండు కమిటీలూ వైఎస్సార్ సీపీ వరం



ప్యానల్ కమిటీల ఎన్నికలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: మున్సిపల్ ప్యానల్ కమిటీల ఎన్నికలో వైఎస్సార్ సీపీ పట్టు నిలుపుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన శనివారం ఉదయం మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో జరిగిన ఎన్నికలో రెండు ప్యానల్ కమిటీల సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మారిన పరిణామాలతో అటు జనసేన, ఇటు టీడీపీ కౌన్సిలర్లు ఈ కమిటీ పగ్గాలను చేజిక్కించుకోవాలని మొదట్లో పావులు కదిపినా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లలో ఉన్న ఐక్యతతో రెండు కమిటీలను సునాయాసంగా గెలిచింది. కౌన్సిల్ ఎక్స్ అఫీషియో సభ్యుల హోదాలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు సమావేశానికి హాజరై కమిటీల ఎన్నికలను జరిపించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ఎన్నికలను కౌన్సిల్ హాలు వద్ద పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ రెండు కమిటీల ఎన్నికను ధ్రువీకరించారు. ఒక్కో కమిటీలో ఏడుగురు కౌన్సిలర్ల చొప్పున ఎన్నికయ్యారు. ప్యానల్ కమిటీలో ఒకటైన కాంట్రాక్ట్ కమిటీలో వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా కౌన్సిలర్లు సుంకర పార్వతి, కొల్లాటి దుర్గాబాయి, వాసర్ల లక్ష్మి, యండమూరి గంగ, దొంగ నాగ సుధారాణి, గోపి రాజీ, యన్నాబత్తుల పద్మలు ఎన్నికయ్యారు. మరో ప్యానల్ కమిటీ అయిన ఉపాధ్యాయేతర పోస్టుల నియామక కమిటీకి వైఎస్సార్ సీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు కట్టోజు సన్న్యయ్యదాసు, బండారు గోవిందు, చిత్రపు రామకృష్ణ, నాగారపు వెంకటేశ్వరరావు, చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ(పెదబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు కమిటీల్లో నియమితులయ్యే కౌన్సిలర్ల పేర్లను పాలక పక్ష కౌన్సిలర్లు సంసాని బులినాని, గొవ్వాల రాజేష్ ప్రతిపాదించగా మరో పాలకపక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ఈ పేర్లను బలపరిచారు. దీంతో కౌన్సిల్ ఆ పేర్లను ఆమోదించింది. రెండు కమిటీలకు ఎన్నికైన 14 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమావేశానంతరం నేరుగా అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్న మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ వద్దకు స్వయంగా వెళ్లి ఆయన ఆశీస్సులు, అభినందనలు అందుకున్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన టీడీపీ, జనసేన కౌన్సిలర్లు

కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ వేయని ప్యానల్ కమిటీలకు ఇప్పుడు ఎన్నిక లేమిటని సమావేశంలో పాల్గొన్న ఒక టీడీపీ కౌన్సిలర్, ముగ్గురు జనసేన కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీనిపై తాము నిరసన వ్యక్తం చేస్తున్నామని చెప్పి వారు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. టీడీపీ నుంచి కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, జనసేన నుంచి కౌన్సిలర్లు యేడిద శ్రీను, పడాల శ్రీదేవి, తిక్కా సత్య లక్ష్మి మాత్రమే సమావేశానికి తొలుత హాజరై అనంతరం బయటకు వెళ్లిపోయారు.

ప్యానల్ కమిటీ సభ్యులకు సత్కారం



ప్యానల్ కమిటీ సభ్యులను సత్కరించిన మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు

అమలాపురం రూరల్: అమలాపురం మున్సిపాలిటీ ప్యానల్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు అభినందించారు. ప్యానల్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన కౌన్సిలర్లు శనివారం అమలాపురం మండలం భట్నవిల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మాజీమంత్రి విశ్వరూప్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారిని మాజీమంత్రి విశ్వరూప్‌తో పాటు ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్‌లు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు రుద్రరాజు నానిరాజు, తిక్కిరెడ్డి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి బాబు, జిల్లా కార్యదర్శి కముజు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం షాపులో దౌర్జన్యం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ షణ్ముగం తదితరులు

యానాం: పట్టణ పరిధిలోని చిన్నాసెంటర్‌లో శనివారం ఓ బియ్యం షాపులోకి కొంతమంది దౌర్జన్యంగా చొరబడి సామగ్రిని బయటకు విసిరేసి నానా హంగామా సృష్టించడంతో ఉద్రిక్తత తలెత్తింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యానాం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వ్యాపార సముదాయంలో రాపర్తి వెంకటేశ్వరరావు అనే వ్యాపారి శ్రీలక్ష్మీగణపతి రైస్‌స్టోర్స్‌ను నిర్వహించుకుంటున్నారు. అయితే సదరు స్థలానికి సంబంధించి వివాదం కోర్టు పరిధిలో ఉంది. అయితే శనివారం కొందరు వ్యక్తులు షాపులోకి చొరబడి కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని, రైస్‌స్టోర్‌ను ఖాళీ చేయాలని వెంకటేశ్వరరావును బెదిరించారు. షాపులో ఉన్న బియ్యం బస్తాలు, క్యాష్ కౌంటర్ తదితర వస్తువులను రోడ్డుపైకి విసిరేసి కరెంటు కనెక్షన్‌ను తొలగించారు. యానాం వర్తక సంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న, గోపాలకృష్ణ తదితరులు ఇచ్చిన సమాచారంతో సీఐ షణ్ముగం, పోలీసులు రంగప్రవేశం చేసి దౌర్జన్యం చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరిస్థితులకు అనుగుణంగా బోధన చేయాలి



ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీవో భీమారావు

అమలాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన చేయాలని సమగ్ర శిక్ష ఏపీవో ఎంఏకే భీమారావు అన్నారు. ఇందుపల్లి హైస్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పాఠశాల సముదాయ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. పేరూరు బండారులంక ఇందుపల్లి కాంప్లెక్స్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశం ఇందుపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో సరేళ్ల దుర్గాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన బోధనా ఉపకరణాలను ఉపయోగించి విద్యాబోధన చేయాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలన్నారు. పాఠశాల సముదాయ జాయింట్ సెక్రెటరీ గౌడ, టీచ్ టూల్ అబ్జర్వర్ జీఎస్ఆర్ ప్రసాద్, పేపకాయల రామచంద్రరావు, బీఎస్ఆర్ ప్రసాద్, ఎస్.రవికుమార్, రామకృష్ణ, సీఆర్ఎంటీ జి.నాగన్న పాల్గొన్నారు.

గోధుమ తాచు హల్‌చల్

అమలాపురం రూరల్: భట్నవిల్లి పంచాయతీ పరిధి మాజీ ఎంపీటీసీ దూనబోయిన రవికుమార్ చెరువు వద్ద ఆరు అడుగుల గోధుమ తాచు శనివారం సాయంత్రం హల్‌చల్ చేసింది. పామును చూసిన ప్రజలు ఆందోళన చెందారు. వెంటనే ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలోని స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకి సమాచారం అందించారు. వర్మ శెట్టిపేట చేరుకుని పాముని చాకచక్యంగా డబ్బాలో బంధించారు.

డ్రెయిన్‌లో పడ్డ ఆబోతు



ఆబోతును హైడ్రాలిక్ క్రేన్‌తో బయటకు తీస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని మేజర్ డ్రెయిన్‌లో శనివారం మధ్యాహ్నం ఓ ఆబోతు ప్రమాదవశాత్తూ పడిపోయి అవస్థలు పడింది. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీ బండి వీరన్న, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, స్థానికులు ఆబోతును రెండు గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు రక్షించారు. డ్రెయిన్ బాగా లోతుగా ఉండి అందులో చిక్కుకుపోయిన ఆబోతుకు తాళ్లు కట్టి హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ఆబోతును రక్షించిన వారిని కాలనీ ప్రజలు అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

తాళ్లరేవు: ప్రజలందరూ దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఊరు ప్రయాణాలు పెట్టుకున్నప్పుడు పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ అన్నారు. శనివారం గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. కాకినాడ రూరల్ సీఐ ఆధ్వర్యంలో కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రావణమాసం పండగలు, పెళ్లిళ్లు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా ఊరు వెళ్లేటప్పుడు ఇంటికి తాళాలు బయటకు కనిపించకుండా వేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తాళ్లరేవు సామాజిక ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



అల్లవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డ వైద్యారోగ్య సిబ్బంది

ముమ్మిడివరం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తాళ్లరేవు వైద్యారోగ్య సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సామాజిక ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటన దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు.

అల్లవరం: కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్‌ని హత్యాచారం చేసిన ఉదంతంపై అల్లవరం మండలం వ్యాప్తంగా వైద్య సిబ్బంది శనివారం అల్లవరం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, సీహెచ్‌సీ ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సరోజ, డాక్టర్లు బాలసుబ్రహ్మణ్యం, సుమ, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వైద్యారోగ్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.

అమలాపురం రూరల్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ దారుణ హత్యకు నిరసనగా కిమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులు శనివారం కిమ్స్ వైద్య కళాశాల నుంచి గడియార స్తంభం సెంటర్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్ జి.రంగారావు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను ఖండిస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండలంలోని మూడు పీహెచ్‌సీల సిబ్బంది గురువారం నిరసన చేపట్టి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ఎల్.నాగార్జున, ఢిల్లీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఐ.పోలవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద వైద్యులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.ఎస్.రాజేష్ బాబు, జి.వేమవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.ఇందిరాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడినవారిని ఉరి తీయాలని కాట్రేనికోన, పల్లంకుర్రు వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీకి వినతి పత్రం అందచేశారు.

యానాం: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని హత్య చేసిన అమానవీయ ఘటనను నిరసిస్తూ నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం యానాం జీజీహెచ్‌లో పోస్టుగాడ్యుయేట్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ వైద్యులు విధులు బహిష్కరించి నిరసన ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆర్ఏఓ రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు.



జూనియర్ డాక్టర్ దారుణ హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కిమ్స్ వైద్యులు



ఉప్పలగుప్తంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

యానాం: మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైజాగ్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక యానాం సూర్య పోలీక్లినిక్ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉచితంగా ఓరల్ ఎగ్జామిన్, మోమోగ్రామ్, పాప్‌స్మియర్ టెస్ట్ తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

అమలాపురం రూరల్: కామనగరువు మెండు వారి పేట వద్ద ముక్తిదామ్ ప్రాంగణంలో ఆకొండి గోపాలకృష్ణమూర్తి గ్రంథాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆకొండి పవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రతి నెలా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు ఆకొండి చాణక్య, మాకిరెడ్డి పూర్ణిమ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.